క్లుప్తంగా

కబ్జా చేసే వారిపై చర్యలు తీసుకోవాలి


కబ్జా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): శ్మశానవాటిక స్థలం కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండలంలోని దంతాన్‌పల్లి గ్రామ పద్మశాలి సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు గజేంద్రుల నర్సింలు, సంఘం సభ్యులు మాట్లాడుతూ.. దంతాన్‌పల్లి గ్రామ శివారులో తమ సంఘం సభ్యులకు పూర్వకాలం నుంచి ఈ స్థలం ఉందన్నారు. బాధితులకు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుకర్ రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

చాకరిమెట్లలో భక్తుల సందడి


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న పూజారులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు స్వామివారికి చందన అలకంరణ చేసి భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. దేవతామూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్


వివిధ వంటకాలతో విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పాలాట ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. ఈసందర్భంగా విద్యార్థులు తమ ఇంటి వద్ద నుంచి రకరకాల వంటకాలను పాఠశాలకు తీసుకువచ్చి ప్రదర్శించారు. తోటి విద్యార్థులకు రుచి చూపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేయాలని వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: మున్సిపాలిటీలోని ఐదవ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని కౌన్సిలర్, బీజేపీ నాయకుడు సురేష్, బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కమిషనర్ రామకృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డును ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారని, వార్డులోని అన్ని ఇళ్లను సర్వే చేయకుండా మధ్యలో నిలిపివేశారని వివరించారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. చైర్మన్, కమిషనర్ స్పందించి వార్డు మొత్తం సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు.

గ్రామీణ బ్యాంక్ సేవలకు అంతరాయం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలకు నాలుగు రోజుల పాటు అంతరాయం కలుగనున్నట్లు బ్యాంక్ మేనేజర్ మురళి తెలిపారు. రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం అవుతున్న కారణంగా.. లావాదేవీలల్లో అంతరాయం కలిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం ఈ నెల 28 నుంచి 31 వరకు బ్యాంక్ లావాదేవీలు అ యిన మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏటీఎం ఖాతా సేవ కేంద్రాలు వంటి లావాదేవీలల్లో అ ంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు. అత్యవసరమైన లావాదేవీలను ఖాతాదారులు 27వ తేదీ లోపు పూర్తి చేసుకోవాలని సూచించారు.

నిద్రావస్థలో నిఘా నేత్రం

- పని చేయని సీసీ కెమెరాలు
- నిర్వహణ గాలికి..
- పట్టించుకునే వారు కరువు

మనోహరాబాద్(తూప్రాన్): శాంతి భద్రతలు, నిఘా వ్యవస్థను పటిష్టం చేసేందుకు పోలీస్‌శాఖ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో లక్షలాది రూపాయలు వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అయితే వాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మండలంలో 17 గ్రామ పంచాయతీలుండగా పలు గ్రామాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేయించిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు.



ముప్పిరెడ్డిపల్లి, దండుపల్లి చౌరస్తాలలో పని చేయని సీసీ కెమెరాలు

కార్మికులపై దాడులు

పరిశ్రమల వాడలైన ముప్పిరెడ్డిపల్లి, కాళ్లకల్, కూచారం, కొండాపూర్‌లో లక్షలు వెచ్చించి ప్రతి గ్రామంలో 30 చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే మనోహరాబాద్, దండుపల్లి, పర్కింబండ, రంగాయపల్లి , చెట్లగౌరారంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. పోలీసులు, ప్రజాప్రతినిధులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని దాతల సహకారంతో ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ వాటి నిర్వహణ మరిచారు. గ్రామ పంచాయతీ నుంచి నిధులు లేకపోవడం, ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పరిశ్రమల వాడలో ఆగంతకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. నిత్యం పరిశ్రమల్లో పని చేసే కార్మికులు పనులు ముగించుకుని ఇంటికి వచ్చే సమయంలో వారిపై దాడి చేసి సెల్‌ఫోన్‌లు, అందినకాడికి నగదును దోచుకెళ్తున్నారు. ఏదైనా ప్రమాదం, దొంగతనం జరిగినా వారిని పట్టుకోవడానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. కొన్ని గ్రామాల్లో దుండగులు కావాలనే సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఇప్పటికైనా పోలీసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు, వాటి నిర్వహణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జీపీలకు సంబంధం లేదు



గ్రామాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణకు సంబంధించి గ్రామ పంచాయతీలకు ఎలాంటి నిధులుండవు. వాటి నిర్వహణ స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలే చూసుకోవాలి. పంచాయతీ నిబంధనల ప్రకారం గ్రామాభివృద్ధికి నిధులు ఉపయోగించబడతాయి.

– లక్ష్మీనర్సింలు, ఎంపీఓ, మనోహరాబాద్

వినియోగంలోకి తేవాలి



గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు కానీ అవి పని చేయడం లేదు. వారం రోజుల క్రితం గ్రామంలోని గానుగబస్తీలో గుర్తు తెలియని దుండగులు రెండు బైకులను చోరీ చేశారు. వారిని పట్టుకుందామని సీసీ కెమెరాలను పరిశీలిస్తే అవి పని చేయడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి వాటిని వినియోగంలోకి తేవాలి.

– దుర్గేష్ యాదవ్, కాళ్లకల్

చండూర్‌లో జీవాలకు టీకాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): జీవాలకు ముందస్తుగా పీపీఆర్ టీకాలు వేయిస్తే, ఆరోగ్యంగా, బలంగా ఎదుగుతాయని పశువైద్యాధికారి వినోద్ అన్నారు. శనివారం ఆయన సిబ్బందితో కలసి చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామంలో గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలలో వచ్చే పీపీఆర్ వ్యాధికి చికిత్స లేదని, ముందస్తు టీకాలు వేయించడంతోనే ఈ వ్యాధి రాకుండా నివారించవచ్చని పేర్కొన్నారు. మూడు నెలల పిల్లల నుంచి సంవత్సరం నిండిన జీవాలకు పీపీఆర్ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. వ్యాధి సోకిన జీవాల కంటి, ముక్కు, మలమూత్రాల నుండి స్రావాలు ఎక్కువగా ద్రవిస్తే, వెంటనే మందకు దూరంగా ఉంచాలన్నారు. వాటి వల్ల మందలోని జీవాలకు వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఇబ్రహీం, శంకర్, అరవింద్ పాల్గొన్నారు.


జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

పశువుల పెంపకంపై జాగ్రత్త వహించాలి

టేక్మాల్(మెదక్): పశువుల పెంపకంలో పలు జాగ్రత్తలు వహించాలని పశువైద్యాధికారి సౌమ్య తెలిపారు. శనివారం మండల కేంద్రమైన టేక్మాల్ పశువైద్యశాలలో పశువులకు టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శుద్ధమైన నీటిని తాపడంతో పాటు పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎటువంటి ఆరోగ్యానికి గురైనా పశువుల చికిత్స నిమిత్తం వైద్యులను సంప్రదించాలని కోరారు. ఇందులో జూనియర్ పశువైద్యాధికారి హన్మంతు, సిబ్బంది ఉన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా మణిరాం

చేగుంట (తూప్రాన్): చేగుంటలో శనివారం టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ ఎన్నికలను జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా మణిరాం, నగేష్‌లను ఎన్నుకున్నారు. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సేవాలాల్ ఆలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గిరిజన తండాలో సేవాలాల్ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా నవగ్రహ పూజ, గణపతి హోమం, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. జగదాంబ విగ్రహానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. గిరిజన సంప్రదాయంతో తండావాసులు నృత్యం చేస్తూ భక్తి గీతాలు ఆలపించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు


ఇందిరమ్మ సర్వేను పరిశీలిస్తున్న గోపాల్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): అర్హులైన పేదలకు ఇళ్లు అందించేదుకే ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని జంగరాయిలో గ్రామ కార్యదర్శి శైలజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను పేదలకు అందించాలనే లక్ష్యంతో వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

మెదక్‌జిల్లాలో గణిత పితామహుడు, నిష్ణాతుడు రామానుజన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రామానుజన్ చేసిన కృషిని కొనియాడారు.

– నెట్‌వర్క్


తూప్రాన్ గీతా స్కూల్లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్


మెదక్‌లోని సిద్ధార్థ విద్యా సంస్థలో..


రామాయంపేట మంజీరా విద్యాలయంలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కరస్పాండెంట్


వెల్దుర్తి: కుకునూర్ ఉన్నత పాఠశాలలో నమూనాలను చూపుతున్న విద్యార్థులు


చిన్నశంకరంపేట: నార్సింగి జెడ్పీపాఠశాలలో గణిత మేళాలో పాల్గొన్న విద్యార్థులు

పోషకాహారంతోనే ఆరోగ్యం


చిలప్‌చెడ్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): సరైన పోషకాహారాలు భుజిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. శనివారం ఆయన చండూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం హరిసింగ్‌తో కలిసి చిలప్‌చెడ్ మండంల బద్రియా తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించి, వారికి అందిస్తున్న పోషకాహారాల గురించి ఆరా తీశారు. కూల్‌డ్రింక్స్, స్వీట్స్, ప్యాకెట్ ఫుడ్, తదితర జంక్ ఫుడ్ తినకూడదని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భిక్షపతి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట్ మండలం హకింపేట్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు, బాలింతలకు పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను అంగన్‌వాడీ టీచర్ స్వప్న, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి, ఉపాధ్యాయుడు కృష్ణ వివరించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లి, రాజిపేట, వెల్మకన్న తదితర పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. అనంతరం తెలంగాణ ఆహారోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చిన కూరలను పరిశీలించారు. ఏయే కూరలలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి, వేటిని ఎక్కువగా తినడం వలన పౌష్టికాహారం లభిస్తుందో ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సరోజ, ఏశేందర్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని కొత్తపేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక రకాల నిధులు కేటాయిస్తుందని, మధ్యాహ్న భోజనం, దుస్తులు, ఉచిత పుస్తకాలు అందజేస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లక్ష్మీ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న హెచ్‌ఎం సుమంగళి

సిలిండర్ పేలి.. పూరిగుడిసె దగ్ధం

చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు ఇంట్లో గ్యాస్‌సిలిండర్ పేలిపోవడంతో నివాస పూరిగుడిసె దగ్ధమైన సంఘటన చిన్నశంకరంపేట మండలం ప్యాటగడ్డతండాలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో ప్యాటగడ్డకు చెందిన రాతుల రాములు నివాస గృహంలోని బీరువాలో ఉన్న రూ.3.50 లక్షల నగదుతో పాటు నాలుగు తులాల బంగారం, 20 తులాల వెండి, ఇతర బట్టలు, పత్రాలతో పాటు ఇంటి సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. చిన్నశంకరంపేట ఆర్‌ఐ రాజు సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పూరిగుడిసె దగ్ధం

హవేళిఘణాపూర్(మెదక్): ప్రమాదవశాత్తు నివాస పూరిగుడిసె దగ్ధమైన ఘటన మండల పరిధిలోని మద్దుల్‌వాయిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గజ్జెల యేసుకు చెందిన నివాస పూరిగుడిసె విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి నిప్పంటుకొని ఇంట్లో ఉన్న రూ.35వేల నగదు, నిత్యావసర వస్తువులు, బియ్యం పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.3లక్షల ఆస్తినష్టం జరిగినట్లు కుటుంబీకులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.


ప్యాటగడ్డలో దగ్ధమైన గుడిసెను పరిశీలించిన ఆర్‌ఐ రాజు

ఘనంగా తెలంగాణ ఆహారోత్సవం


నిజాంపేట: విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంతో పాటే రాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలంగాణ ఆహారోత్సవం ఘనంగా నిర్వహించారు. పోషకాహారం విలువను తెలియజేసే విధంగా ఈ కార్యక్రమం ఉందని మండల విద్యాధికారి యాదగిరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయట తినే చిరుతిళ్లు ఆరోగ్యానికి హానికరమని, సాంప్రదాయ వంటలతో తయారుచేసిన ఆహార పదార్థాలలో సూక్ష్మ పోషకాలు మెండుగా ఉంటాయన్నారు. వీటి వల్ల పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ఆహారోత్సవం సందర్భంగా పిల్లల తల్లిదండ్రులు సర్వపిండి, మలీదా, మక్కరొట్టెలు, పులిహోర, రవ్వలడ్డూలు, సేమియా తదితర ఆహార పదార్థాలను వండుకొని వచ్చి పిల్లలందరికి వడ్డించారు. ఈ సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఇందిర, మండల మాజీ కోఆప్షన్ మెంబర్ గౌస్, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, అరుణ, చంద్రకాంత్, కుమారస్వామి, షాదుల్లా తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మా ప్రభుత్వమే ఇచ్చింది.. మేమే ప్రారంభిస్తాం


108ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి ప్రభుత్వ ఆస్పత్రికి అందించిన 108ను ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు ప్రారంభిస్తారని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి కుమార్ శనివారం ప్రకటన విడుదల చేశారు. అయితే ఈ ప్రకటన వచ్చిన కొద్దిసేపటికే కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని 108ను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ తదితరులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన అంబులెన్స్ కాబట్టే తాము ప్రారంభించామన్నారు. దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సూచన మేరకు తాము ప్రారంభించినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యార్థులకు అవగాహన

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే విధులపై ఎంపీడీఓ దామోదర్ అవగాహన కల్పించారు. శనివారం మోడల్‌స్కూల్ ఇంటర్ ఐటీ ఒకేషనల్ విద్యార్థులు ఎంపీపీ కార్యాలయ విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అధికారుల విధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులతో ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించే విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐటీ టీచర్ ప్రమోద్, పీడీ బస్వార్ పాల్గొన్నారు.

◆ కన్నారం పాఠశాల తనిఖీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కన్నారం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలరాజు శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులచేత చదివించి పలు ప్రశ్నలకు జవాబులు రాబట్టారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతో పాటు గణితం రావాలని ఎంఈఓ ఆదేశించారు. హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయురాలు స్వప్న సిబ్బది త ది తరులు ఉన్నారు.

◆ సర్వేను పరిశీలించిన ఎంపీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని శేరితండాలో పంచాయతీ కార్యదర్శి ఇర్షద్ ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయగా ఎంపీఓ కలీముల్ల పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటిని సర్వే చేయాలని చెప్పారు. దరఖాస్తుదారులు అందుబాటులో లేకుంటే సమాచారం ఇవ్వాలన్నారు.

◆ నేడు ప్రజాదర్బార్

రేగోడ్ (మెదక్): రేగోడ్‌లోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై ప్రజాదర్బార్ సభ నిర్వహించనున్నట్లు ఏపీఓ జగన్మోహన్‌సింగ్ తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన పనులపై 14వ విడత సభలో వివరిస్తామని చెప్పారు.

◆ ఇద్దరు విలేకరులపై కేసు

నర్సాపూర్: మానసికంగా వేధిస్తున్నారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు విలేకరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లింగం శనివారం తెలిపారు. నర్సాపూర్‌లో పని చేస్తున్న ఓ టీవీ చానల్ విలేకరి ప్రసాద్‌గౌడ్ తన భర్త సంపత్ కుమార్ బతికుండగా అప్పుగా డబ్బులు ఇచ్చానని, వాటిని చెల్లించాలని తనను వేధిస్తున్నాడని నర్సాపూర్‌కు చెందిన కవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా మరో టీవీ చానల్ విలేకరి శ్రీనివాస్ సైతం తనను వేధించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

◆ యువకుడు అదృశ్యం


దినేశ్ రెడ్డి(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): కంపెనీలో పనికి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. శనివారం స్థానిక ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొంతి గ్రామానికి చెందిన మునిగె దినేశ్ రెడ్డి (25) కండ్లకొయ్యలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. రోజూ ఇంటి నుంచి బైక్‌పై కంపెనీకి వెళ్లి సాయంత్రం వస్తాడు.19న కంపెనీకి వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దినేశ్ రెడ్డి తండ్రి తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

◆ బైక్ అదుపుతప్పి.. కిందపడి – వ్యక్తికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): బైక్ అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నశంకరంపేటలోని మోలలల తయారీ పరిశ్రమలో పని చేసే అశోక్ యాదవ్ శనివారం రాత్రి పని నిమిత్తం శంకరంపేటకు వచ్చి పరిశ్రమ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్‌లు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.


గాయాలతో అశోక్ యాదవ్

◆ కొనసాగుతున్న కల్యాణ ఏర్పాట్లు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి కల్యాణం ఈనెల 29న జరగనుండటంతో ఆలయ అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. శనివారం ఆలయ పరిసరాలతో పాటు స్వామి రాజగోపురాన్ని నీటితో కడిగి శుద్ధి చేశారు. కల్యాణం జరగే తోట బావి ప్రాంతంలో మట్టితో చదును చేశారు.